ప్రజాశక్తి
సోమవారం 6 జనవరి 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

రాజుకుంటున్న బిల్లుల గోల

శనివారం నాడు కౌన్సిల్ సమావేశం వివాదం నేపథ్యంలో సమావేశం నుండి వాకౌట్ చేసి వెళ్లిపోతున్న కమిషనర్ శ్రీనివాసులు, ఉద్యోగులు

- కమిషనర్‌పై వైసిపి కౌన్సిలర్ల అవినీతి ఆరోపణలు
- వైసిపి సభ్యుల ప్రవర్తన సరికాదు : టిడిపి
- కమిషనర్‌కు ఉద్యోగ, కార్మిక సంఘాల మద్దతు
- మళ్లీ కౌన్సిల్ భేటీపై ప్రతిష్టంభన

ప్రజాశక్తి గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో శనివారం ఏర్పడిన వివాదం చిలికిచిలికి గాలి వానగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారులపై డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు దూకుడుగా వ్యవహరిస్తున్నారని, చట్ట ప్రకారం అయనపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారని తెలిసింది. ఈ విషయం తెలిసిన డైమండ్‌బాబుతో పాటు పలువురు వైసిపి కార్పొరేటర్లు ఆదివారం కమిషనర్‌పై అవినీతి ఆరోపణలు చేశారు. డైమండ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారి అనే విషయాన్ని కమిషనర్ మరచి ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్‌లో విజయవాడ బుడమేరు ముంపు సమయంలో జరిగిన ఊపద్రవాన్ని అడ్డుపెట్టుకొని కమిషనర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, నిధుల దుర్వినియోగం చేశారని చెప్పారు. రూ.9 కోట్లకు పైగా నిధులను వరదలను అడ్డుపెట్టుకొని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఆగమేఘాల మీద నిధులను మంజూరు చేశారని, నచ్చిన వారికి బిల్లులను చెల్లించారని ధ్వజమెత్తారు. నిధుల దుర్వినియోగం పై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేయాలని కోరారు. శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ఒక్క పదాన్ని అడ్డం పెట్టుకొని కమిషనర్ సమావేశం నుంచి బాయ్ కాట్ చేశారని అన్నారు. ఆ అధికారం కమిషనర్‌కు ఎవరిచ్చారనీ ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు అడిగే ప్రశ్నలకు కచ్చితంగా సంబంధిత అధికారులు సమాధానం చెప్పుకోవాలి... నేనేరాజు - నేనే మంత్రి అనే తీరుగా కమిషనర్ వ్యవహరించడం కుదరదు.. అని డైమండ్ బాబు అన్నారు. పబ్లిక్ సర్వెంట్‌గా వున్న కమిషనర్ ప్రజల చేత ఎన్నికైన కౌన్సిల్‌కు జవాబుదారీగా ఉండాలని అన్నారు. టిడిపి నాయకుల మెహర్బానీ కోసం తన పబ్బం గడుపుకోవాడనికే కమిషనర్ ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు.

ఇదిలా ఉండగా కమిషనర్, 2లో

ప్రమాదం జరిగిన ప్రదేశంలో రాత్రిపూట గాలింపు చర్యలు

ఈతకెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మృతులు గోపీచంద్, చరణ్ (ఫైల్)

ఈతకెళ్లి ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడిన ఘటన సత్తెనపల్లి పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణంలోని రాజులకాలనీకి చెందిన పొదిలి చరణ్ (14), వడ్డవల్లికి చెందిన నల్లూరి గోపీచంద్ (14) రాఘవేంద్ర బాలకుటీర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావటంతో అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మరో ముగ్గురు స్నేహితులతో కలిసి అమరావతి మధ్యాహ్నం మేజర్ కాల్వలో ఈత కొట్టేందుకు వెళ్లారు. చరణ్, గోపీచంద్‌కు ఈత రాకపోవడంతోపాటు కాస్తంత లోతుకు వెళ్లడంతో కాల్వలోని తూటికాడలో చిక్కుకుని ఇద్దరూ గల్లంతయ్యారు. ఇది గమనించిన తోటి విద్యార్థులు పరుగున వెళ్లి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో స్థానికులు, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చేపట్టారు. 6 గంటలకు చరణ్ మృతదేహం కనిపించగా గోపిచంద్ కోసం ముమ్మరంగా వెతికి మృతదేహాన్ని రాత్రి 10 గంటలకు వెలికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇద్దరి మృతితో రాజులకాలనీ, వడ్డవల్లి ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కృష్ణవేణి, భాస్కరరావు దంపతులకు ఇద్దరు కుమారులు కాగా వారిలో చరణ్ చిన్నవాడు. భాస్కరరావు యడ్లపాడులోని క్రషర్‌లో పనిచేస్తున్నారు. పెద్ద కుమారుడు శశికిరణ్, చరణ్ సత్తెనపల్లిలోని మేనమామ రాచగుండ ఏడుకొండలు వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. సుహాసిని, కిరణ్ కుమార్ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా గోపీచంద్ చిన్నవాడు. కిరణ్ కుమార్ పట్టణంలోని హెడీఎఫ్‌సి బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా, సుహాసిని నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు.

కౌలురైతు చావుకొచ్చిన దొంగల చర్య

ప్రజాశక్తి- మాచర్ల

పొలంలో విద్యుద్ఘాతానికి గురై కౌలురైతు మృతి చెందిన ఘటన మండలంలోని కంభంపాడులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన దుర్గెంపూడి కేశవరెడ్డి(38) 23 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని అందులో 16 ఎకరాల మాగాణి, 7 ఎకరాల మెట్ట సాగు చేస్తున్నాడు. ఆదివారం కూలీలను తీసుకొని వరి నాట్లు వేసేందుకు పొలానికి వెళ్లాడు. టాన్స్‌ఫారం వద్ద వైర్లు వేలాడుపడుతుండటంతో వాటిని పక్కకు వేసేందుకు ప్రయత్నించగా షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. కొద్దిరోజుల క్రితం ట్రాన్స్‌పార్మర్లను పగలగొట్టి లోపల రాగి వైర్లు దోచుకునేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించి వీలుకాక వెళ్లిపోయారు. ఆ ప్రయత్నంలో దొంగలు విద్యుత్ వైర్లను కిందకి వదిలేశారు. ఆ వైర్లను జాగ్రత్తగా పక్కకు తప్పిస్తుండగా కేశవరెడ్డికి ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డాడు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మాచర్ల రూరల్‌పోలీసులు కేసునమోదు చేశారు. మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

సంక్రాంతికి సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ పల్నాడు జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్‌లోని వారు సొంతూళ్లకు చేరేందుకు ఆర్టీసీ ప్రత్యేకంగా 137 బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ పల్నాడు జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 5 రోజుల పాటు జిల్లాలోని ఆయా డిపోల నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్ మధ్య బస్సులు నడుస్తాయని తెలిపారు. 9న నరసరావుపేట డిపో నుంచి అల్ట్రా డీలక్స్ బస్సులు రెండు, మాచర్ల డిపో నుంచి సూపర్ లగ్జరీ, ఎక్స్ప్రెస్ బస్సు ఒక్కొక్కటి చొప్పున, చిలకలూరిపేట నుండి 3 సూపర్ లగ్జరీలు, సత్తెనపల్లి నుంచి 1, పిడుగురాళ్ల నుంచి 2 ఎక్స్‌ప్రెస్‌లు, వినుకొండ నుంచి 5 అల్ట్రా డీలక్స్ మొత్తం 15 బస్సులు నడుస్తాయన్నారు. 10న 40 బస్సులు అందుబాటులో ఉంటాయని, ఇందులో నరసరావుపేట నుంచి 8 అల్ట్రా డీలక్స్‌లు, మాచర్ల నుంచి ఒక సూపర్ లగ్జరీ, 9 ఎక్స్‌ప్రెస్ బస్సులు, చిలకలూరిపేట నుంచి 3 సూపర్ లగ్జరీలు, 4 ఎక్స్‌ప్రెస్‌లు, సత్తెనపల్లి నుంచి ఒక ఎక్స్‌ప్రెస్, పిడుగురాళ్ల నుండి 4 ఎక్స్‌ప్రెస్‌లు, వినుకొండ నుండి 5 అల్ట్రా డీలక్స్, 5 ఎక్స్‌ప్రెస్‌ల చొప్పున నడుపుతామన్నారు.

11న మొత్తం 38 బస్సులు నడుపుతుండగా నరసరావుపేట నుండి 8 అల్ట్రా డీలక్స్‌లు, మాచర్ల నుంచి ఒక సూపర్ లగ్జరీ, 7 ఎక్స్‌ప్రెస్, చిలకలూరిపేట నుంచి 3 సూపర్ లగ్జరీలు, 4 ఎక్స్‌ప్రెస్‌లు, సత్తెనపల్లి నుంచి ఒక సూపర్ లగ్జరీ, పిడుగురాళ్ల నుంచి 2లో

చేబ్రోలులో కార్మికుల తొలగింపు చట్టాల ఉల్లంఘనే

ఐదో రోజుకు కార్మికుల నిరసన - 5 లో

జిజిహెచ్‌లో 7 ఓపీ కేంద్రాలు ప్రారంభం

- 8 లో

కోటి ఆశలతో వరినాట్లు

- రబీకి పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు
- అంచనాలకు మించి సాగయ్యే అవకాశం

4లో

యంత్రాలొచ్చినా గిరాకి తగ్గని అరక

సంక్రాంతికి సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

4 ఎక్స్‌ప్రెస్, వినుకొండ నుంచి 5 చొప్పున అల్ట్రా డీలక్స్, 5 ఎక్స్‌ప్రెస్‌లు ఏర్పాటు చేశామన్నారు. 12వ తేదీన 40 బస్సులు నడుపుతుండగా నరసరావుపేటకు చెందిన 8 అల్ట్రా డీలక్స్‌లు, మాచర్లకు చెందిన ఒక సూపర్ లగ్జరీ, 9 ఎక్స్‌ప్రెస్‌లు, చిలకలూరిపేట నుంచి 3 సూపర్ లగ్జరీలు, 4 ఎక్స్‌ప్రెస్, సత్తెనపల్లి నుంచి ఒక సూపర్ లగ్జరీ, పిడుగురాళ్ల నుంచి 4 ఎక్స్‌ప్రెస్‌లు, వినుకొండ నుండి అల్ట్రాడీలక్స్ 5, ఎక్స్‌ప్రెస్‌లు 5 నడుస్తాయన్నారు. భోగి రోజున నరసరావుపేట, వినుకొండకు ఒక్కొక్కటి చొప్పున అల్ట్రా డీలక్స్‌లు, మాచర్ల, చిలకలూరిపేటకు ఒక్కొక్క సూపర్ లగ్జరీ అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రత్యేక బస్సులలో సైతం సాధారణ ఛార్జీలే వసూలు చేస్తున్నామని, టిక్కెట్లను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ పొందవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు ఉపయోగించుకోవాలని, ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని అన్నారు.

రాజుకుంటున్న బిల్లుల గోల

(మొదటి పేజీ తరువాయి)

అధికారులపై దూకుడుగా వ్యవహరిస్తున్న డిప్యూటీ మేయర్‌పై చర్యలు తీసుకోవాలని పలు ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు డిమాండు చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నా వైసిపి దూకుడు తగ్గలేదని సర్వత్రా విమర్శలు వచ్చాయి. బినామీ పేర్లతో వైసిపి వారు చేసిన పనులకు బిల్లులు డ్రా చేసుకుందుకు ఈ రాద్ధాంతం చేస్తున్నారని అధికారులు అంటున్నారు. వైసిపి సభ్యుల తీరు మార్చుకోవాలని టిడిపి కార్పొరేటర్ ఈరెంటి వరప్రసాద్ అన్నారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్లకు ప్రశ్నలు అడిగే హక్కు ఉందని కానీ ఆధికారులపై దౌర్జన్యం చేసే పద్ధతిలో నిలదీయడం సరి కాదని అన్నారు. మరోవైపు అధికారులకు, వైసిపి కార్పొరేటర్లకు మధ్య ఏర్పడిన వివాదం ఎప్పటికి పరిష్కారం అవుతుందో ప్రశ్నార్థకమైంది. ఇప్పటికే పలు మార్లు వాయిదా పడిన కౌన్సిల్ సమావేశం తిరిగి ఎప్పుడు జరుగుతుందో కార్పొరేటర్లుకూ అంతు చిక్కడం లేదు. పలు డివిజన్‌లలో అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపునకు ప్రతిపాదించిన ప్రియాంబుల్స్ కౌన్సిల్ ఆమోదం ఎప్పటికీ వస్తుందో కార్పొరేటర్లుకూ తెలియడం లేదు.

రోడ్డుపై గుంతలు.. వాహనదార్లకు ప్రమాదాలు

ప్రజాశక్తి కారంపూడి

మండల పరిధిలోని ఇనుపరాజుపల్లి, కాచవరం గ్రామాల నుండి వెళ్లే రోడ్లపై ఏర్పడిన గుంతలతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడిన రోడ్డు వలన రాళ్లు తేలడంతో వాహనాలు అదుపు తప్పి పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. నిత్యం వందలాది వాహనదారులు, బస్సులు, ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొంత కాలంగా ఈ రోడ్డు ఇలాగే వున్నా అధికారులు, పట్టించున్న దాఖలాలు లేవు. కారంపూడి నుండి దాచేపల్లి మండలానికి వివిధ రకాల పనుల కోసం వాహనదారులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల కారణంగా వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రజాప్రతినిదులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మారుతున్న కాలానికి అనుకూలంగా యంత్ర సాగు పెరిగింది. వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో కాడెడ్లు కనుమరుగవుతున్నాయి. గత డిసెంబర్‌లో ఏకతాటిగా కురిసిన భారీ వర్షాలకు మెట్ట పొలాల్లో కలుపు మొక్కలు పెరిగాయి. ప్రస్తుతం రైతులు పంట చేలల్లో కలుపు తీత పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. కలుపు నియంత్రణకు కూలీలతో పాటు అరకల కోసం వెదుకులాడుతున్నారు. దీంతో కాడెడ్లు ఉన్న అరక కూలీ రైతులకు డిమాండ్ పెరిగింది. దుక్కి దున్నడం మొదలు పంట ఇంటికి వచ్చే వరకు ట్రాక్టర్ల వినియోగం పెరిగినా ఒక దశలో రైతులకు కాడెడ్లు అవసరం తప్పడం లేదు. ఎన్ని యంత్రాలు వచ్చిన అరక సాగుకు డిమాండ్ తగ్గడం లేదు. పత్తి, శనగ, సుబాబుల్ విత్తనాలు విత్తాలన్నా అరకతో సాళ్లు పెట్టాల్సిందే. పత్తి కలుపు తీత నివారణకు అరకతో వ్యవసాయం చేయాల్సిందే. నారుమడి కలియ దున్నాలన్నా వరి నాటు వేసేందుకు నేల చదును కావాలన్నా కాడెట్లు తప్పనిసరని రైతులంటున్నారు.

గ్రామాల్లో తగ్గుతున్న కాడెడ్లు..

గ్రామాల్లో ఒకప్పుడు ప్రతి రైతు ఇంటి ఎదుట కాడెడ్లు, ఎడ్ల బండ్లు దర్శనం ఇచ్చేవి. ప్రస్తుతం 70 శాతం మంది రైతుల ఇండ్ల ఎదుట ఎడ్లబండ్లకు బదులుగా ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుకూలంగా దిగుబడులు పెంచు కోవడం, శ్రమ తగ్గించుకోవడం, సమయం ఆదా చేసుకున్నందుకు యంత్రాల సాగు చేస్తున్నారు. చేను చ ద ం న ం

కా డి

నుంచి దిగుబడి వచ్చిన పంట అమ్మకానికి మార్కెట్‌కు తరలించే వరకూ వినియోగిస్తున్నారు. దీంతో కాడెడ్లు మేతతో పాటు వాటి ఆలన పాలన చూసుకోవడం వీలు కావడం లేదని చాలామంది రైతులు ఎడ్లను అమ్ము కుంటున్నారు. కానీ ఒకానొక దశలో వాటి అవసరం తప్పడం లేదని రైతులు చెబుతున్నారు. పత్తి, కంది, మిర్చి పొగాకు పొలాల్లో చెట్ల మధ్య కలుపు నివారణకు ట్రాక్టర్ ద్వారా సాధ్యపడదు. అరక ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. అంతేకాకుండా వర్షాలకు ట్రాక్టర్‌లు పంట పొలాల్లో వ్యవసాయం చేసేందుకు సాధ్యం కాదు. ఈ సమయంలో ఎద్దులు అరకనే రైతులు ఎక్కువగా వినియోస్తున్నారు.

గడ్డి కొరతతో పోషణ భారం

కోండ్రు పిచ్చారావు, కుంకలగుంట గ్రామం, నకరికల్లు మండలం.

కొద్దిపాటి పొలంతో పాటు 20 ఎకరాలకు పైగా పొలం కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి సాగు చేస్తున్నాను. గతంలో 2 జతలు ఎడ్లుండేవి. నా పొలంలో వ్యవసాయ పనులతో పాటు బాడుగ ద్వారా కొంత ఆదాయం వస్తుండేది. పంట కాలంలో మొత్తం మీద 3 నుండి 4 నెలల కాలంలో ఎద్దుల వ్యవసాయం ముగుస్తుంది. 8 నెలల పాటు వాటి పోషణ భారంగా ఉండడంతో అమ్మేసి ప్రస్తుతం బాడుగ అరకతో వ్యవసాయం చేస్తున్నాను. ఎకరాకు రూ.800 చొప్పున ఆరకతో పత్తి, మిర్చి పొలంలో పనులు చేస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు కాడెడ్లు రైతులు 4 ఎకరాల్లో వ్యవసాయం చేస్తారు. పత్తిలో, మిర్చి పొలంలో కలుపు నివారణకు, వేరు వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేందుకు అరక వ్యవసాయం మంచిది.

ఆలస్యమైతే పంట ఎదగదు

ఎం.చక్రవర్తి, బొగ్గరం, ఈపూరు మండలం.

గత నెలలో కురిసిన వర్షాలకు మిర్చి, పత్తిలో కలుపు మొక్కలు బాగా పెరిగాయి. పత్తి విత్తనాలు, విత్తాడానికి సాళ్లు పెట్టేందుకు, వరి నారుమడి సిద్ధం చేయడానికి, అరకనే తప్ప సరిగా అవసరం. అరక అయితే సాళ్ల మధ్యలో ఉన్న గడ్డి పోతుంది. ట్రాక్టర్లతో అయితే చెట్లు విరిగిపోతాయి. గతంలో ఎద్దులు ఉండేవి, వాటిని అమ్మి ఇప్పుడు అరక కోసం ఎదురు చూస్తున్నాను. అలస్యమైతే గడ్డి పెరిగి పంట ఎదగదు. బాగా వ్యవసాయం చేసే ఎద్దులు కొనుగోలు చేయాలంటే రూ.2 లక్షలు వెచ్చించాలి.

చంద్రన్న కానుక లేనట్టేనా..?

- **ఇప్పటికే క్రిస్మస్ కానుకను విస్మరించిన ప్రభుత్వం**
- **పథకాలను, కానుకలను పునరుద్ధరిస్తామనే హామీని గుర్తు చేసుకుంటున్న జనం**

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నిత్యావసరస ధరలతోపాటు, పండగల సందర్భంగా చేసుకునే పిండివంటల్లో వినియోగించే వస్తువుల ధరలూ భారీగా పెరిగాయి. కందిపప్పు రూ.175/180, పామాయిల్ రూ.130, బెల్లం కిలో రూ50-60, గోధుమ పిండి రూ.55 శనగ పిండి రూ.55, జొన్న కిలో రూ.80 వరకూ పలుకుతున్నాయి. పిండి వంటలు చేసుకోవాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో రేషన్ ద్వారా గత టిడిపి ప్రభుత్వంలో మాదిరి సంక్రాంతి సందర్భంగా చంద్రన్న కానుక ఏదైనా అందజేస్తారా? అని పేదలు ఎదురు చూస్తున్నారు.

2014లో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన వీటి సరఫరాను వైసిపి ప్రభుత్వం ఎత్తేసింది. టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫాఅంటూ సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. తాజాగా క్రిస్మస్ కానుకను మరిచిపోయిన కూటమి ప్రభుత్వం సంక్రాంతి కానుకనైనా ఇవ్వాలని తెల్లరేషన్‌కార్డు దారులు కోరుతున్నారు.

శనగపప్పు, బెల్లం, గోధుమ పిండి, పామాయిల్, కందిపప్పు, 100 గ్రాముల నెయ్యి ఒక సంచిలో పెట్టి చంద్రన్న కానుకగా అందజేశారు. అంతే కాక రాగి, గోధుమ పిండి, జొన్నలను రూ.67 ఇచ్చేవారు. ప్రస్తుతం మార్కెట్లో వీటి ధర రూ.80/90గా ఉంది. చంద్రన్న కానుకలు ఇచ్చే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి లేదనే విషయం క్రిస్మస్ సందర్భంగానే నిర్ధారణైంది. అయితే ఎన్నికల సందర్భంలో చంద్రబాబు చేసిన ప్రకటనలను ప్రజలను గుర్తు చేస్తున్నారు. తాము గెలిస్తే తమ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలను పునరుద్ధరిస్తామని, సంక్రాంతి, రంజాన్ కానుకలను కూడా అందిస్తామని హామీ ఇచ్చారని పలువురు గుర్తు చేస్తూ విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే సరుకులతోనే పండగ మొత్తం గడవకపోయినా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో తమకు కాస్తయినా ఉపశమనం దొరుకుతుందని సామాన్యులు భావిస్తున్నారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No : 129/2015

చల్లా ప్రసన్న మరికొందరు .... వాదులు

Vs

తన్నీరు పేరమ్మ (డైడ్) మరికొందరు .... ప్రతివాదులు

D-2) తన్నీరు గంగయ్య తండ్రి కోటయ్య
D-3) తన్నీరు ఆంజనేయులు తండ్రి కోటయ్య
D-4) తన్నీరు శ్రీనివాసరావు తండ్రి కోటయ్య
D-5) తన్నీరు బాలకోటయ్య తండ్రి కోటయ్య
D-6) కుంచపు వెంకాయమ్మ భర్త దానయ్య
D-7) కుంచపు బుల్లి భర్త సింగరకొండ
1,2,5 ప్రతివాదులు R/o ఎక్కలవారిపాలెం (గ్రామం) పలనాడు(జిల్లా)
3,6 ప్రతివాదులు R/o E.T గ్రామం, పల్నాడు (జిల్లా.)
4,ప్రతివాది కోటప్పకొండ, పల్నాడు (జిల్లా)

పై నంబరు దావాలో చనిపోయిన ఒకటవ ప్రతివాదికి మిమ్ములను వారసులుగా చేర్చి దావా సమన్లు మీకు ఎన్నిసార్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు 04-02-2025 న ఉదయం 10.30 నుండి సాయంత్రం ఐదు గంటల లోపు పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకునేది. లేనిచో దావాని మీ పరోక్షముగా తీర్మానింపబడును.

// కోర్టు వారి అనుమతితో //

మోతుకూరి సుభాష్ బాబు
మురకొండ చంద్రశేఖర్
అడ్వకేట్స్, అద్దంకి

మహారాజశ్రీ 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు,గుంటూరు.

O.S.NO.54/2021

Between:-
బొలిశెట్టి సరస్వతీ .... వాది
V/s
పోతు గుంట్ల సాంబశివరావు ..... ప్రతివాది

To
Pothuguntla Sambaliva Rao. clo.
Pothuguntla Aruna, Door no. 37-155/9,
8th line, Rajiv Nagar, GUNTUR-522509

పై నెంబరు గల దావా నందు మీరు మీ తరపున లాయర్ గారి ద్వారా ఆన్సరు దాఖలు చేసుకొనియున్నారు. దావాలో వాది తన సాక్ష్యంను కోర్టులో దాఖలు పరిచినారు. కానీ మీరు గాని మీ లాయరు గారు గానీ కేసును విచారణ చేయకుండా ఉండినారు. పై కోర్టువారు మీకు నోటీసులు జారీ చేసినా మీరు ముట్టని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియ చేయునది ఏమనగా మీరు గాని మీ తరుపున లాయర్ గారి ద్వార గానీ ది :-27-01-2025న ఉదయం 10:30. ని.లకు పైకోర్టులో హాజరై పై కేసును విచారణ చేయించు కోవలసినది. లేని ఎడల మీ పరోక్షమున పై దావాను తీర్మానించ బడును.

// పై కోర్టు వారి ఉత్తర్వులతో //

ఇట్లు
TELANKULA SURESH BABU
ADVOCATE
Library Street, Parchur-523169,
BAPATLA Dist.
A.P. INDIA. 9440333262.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటి కంట్రోల్ సిబ్బంది, ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం కమిషనర్ లాంచెస్టర్‌రోడ్, సాయికృష్ణనగర్, ఆనందపేట, బిఆర్ స్టేడియం రిజర్వాయర్ ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టే అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశలవారీగా క్వాలిటి కంట్రోల్ సిబ్బంది రికార్డ్ చేయాలన్నారు. ఎమినిటి కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పనులను ప్రతిరోజు పరిశీలించాలని, నాణ్యతలో లోపం గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, ప్రాధాన్యత క్రమంలో చేపడతామన్నారు. అలాగే నగరంలో మెరుగైన పారిశుధ్య పనులు జరిగేందుకు డివిజన్ల పునర్విభజన చేశామని, పనులకు అవసరమైన వాహనాలు, పుష్‌కార్ట్స్, బిన్లు అందించినందున, శానిటరీ ఇన్స్పెక్టర్లు క్రమపద్ధతిలో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ, డ్రైన్ శుభ్రం, గ్యాంగ్ వర్క్ ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో శుభ్రం జరగాలన్నారు. పర్యటనలో ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ అంగడి రాజేష్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంగడిగుంటలో పర్యటిస్తున్న కమిషనర్

'అమ్మకి వందనం' వాయిదా తగదు : అవగాహన

ప్రజాశక్తి - గుంటూరు

కీలకమైన అమ్మకు వందనం పథకం ఒక ఏడాది వాయిదా పడటం విద్యార్థుల విద్యా భవితకు తీవ్ర విఘాతమని, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు పేర్లు మారినా వాటికింకా ప్రభుత్వ దీవెనలు లేకపోవడం దారుణమని అవగాహన సంస్థ విమర్శించింది. ఆదివారం అవగాహన కార్యాలయంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో విద్యార్థులకు సంబంధించిన ఈ పథకాలకైనా ఆమోద ముద్ర వేస్తారని ఆశించిన విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. ఫీజు రియంబర్స్ మెంట్ పథకాల వల్లనే సామాన్య బడుగు వర్గాల విద్యార్థులు అత్యున్నత విద్యా సంస్థలలో కూడా చదువుకోగలుగుతున్నారన్నారు. ఇప్పుడు గతంలో అమ్మఒడిగా ఇప్పుడు అమ్మకు వందనం పేరుతో పిలువబడుతున్న పథకం మరియు విద్యా దీవెన వంటి పథకాలను సంవత్సరాల తరబడి వాయిదా వేయటం విద్యార్థులను దెబ్బతీయటమేనని అవగాహన సంస్థ విమర్శిస్తుంది. ఫీజు రియంబర్స్ మెంట్ పథకం కింద మొత్తం నాలుగు త్రైమాసిక ఫీజు 2,800 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని, స్కాలర్ షిప్‌లు రూ.1100 కోట్లు బకాయిలు ఉన్నాయని, ఈ ఫీజుల చెల్లింపు ఎప్పుడు ఉంటుందన్న విషయంపైనా స్పష్టత లేకుండా ఉందని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. ఫీజులు కట్టని కారణంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నాయని, ధ్రువీకరణ పత్రాలు ఇవ్వటం లేదని, ఇంజనీరింగ్ విద్యార్థుల బాధలు వర్ణనాతీతమని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. విద్యార్థులకు సంబంధించిన పథకాల విషయంలో సర్కారుకు నిబద్ధత ఉండి తీరాల్సిందేనని, ఒక విద్యా సంవత్సరం మొత్తం పథకం అమలు నిలిపేయటం సరికాదని, పథకాలపై రాజకీయాలు సరికాదని అవగాహన సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుందని కొండా శివరామిరెడ్డి తెలిపారు.

గాయపడినవారిని ఆసుపత్రికి తరలించిన పోలీసులు, సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసు అధికారులు

హైందవ శంఖారావం నుండి తిరుగు ప్రయాణంలో బస్సుబోల్తా - 30 మందికి గాయాలు

క్షతగాత్రులు ప్రకాశం జిల్లా వాసులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆదివారం కృష్ణ జిల్లా గన్నవరంలో జరిగిన హైందవ శంఖారావం కార్యక్రమానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో బస్సు మరమ్మతులకు గురై బోల్తా పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం ఈటి సమీపంలో జరిగిన సంఘటనలో ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం తర్లుపాడు పరిసర గ్రామాలకు చెందిన 40 మంది ప్రయాణిస్తున్నారు. వారిలో 30 మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు బస్సు అద్దాలు పగుల గొట్టి క్షతగాత్రులను బయటకు తీశారు. పోలీసులు సమాచారం అందించారు. చిలకలూరిపేట గ్రామీణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను 108 వాహనాలలో చిలకలూరిపేట, నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. క్రేన్ సాయంతో బస్సును పైకి లేపి ట్రాఫిక్ పోలీసులు క్రమబద్ధీకరించారు. స్వల్ప ప్రమాదం చోటు చేసుకోవడంతో బస్సులో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు జిఎంసిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మని కమిషనర్ పులి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ (0863- 2224 202) నిర్వహిస్తామని, అనంతరం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మాన్ని కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంటవరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు నేరుగా అర్జీలు, ఫిర్యాదులు అధికారులకు అందజేయవచ్చని తెలిపారు.

యుటిఎఫ్ బ్యాగులు, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరిలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేయించిన లంచ్ బ్యాగులు, నూతన సంవత్సర క్యాలెండర్లను ఎంఈవో కె.బాబు, ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు కె.సైదా నాయక్ ఆవిష్కరించారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయు లందరికీ లంచ్ బ్యాగులు, క్యాలెండర్లను ఉచితంగా అందజేస్తామని సైదా నాయక్ తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి శివరామిరెడ్డి, కోశాధికారి ఎస్కే రెహమాన్, జిల్లా నాయకులు ఎం.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుభాని, సాయి

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మేడికొండూరు

రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొన దంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన మేడికొండూరు సమీపంలో హరియాలి పెట్రోలు బంక్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. గుంటూరుకు చెందిన సుభాని, సాయి ఇద్దరు సత్తెనపల్లి వైపు నుండి ద్విచక్రవాహనం మీద తిరుగు ప్రయాణం గుంటూరు వెళ తున్నారు. మార్గమధ్యలో మేడికొండూరు వద్ద, గుంటూరు నుంచి సత్తెనపల్లి వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నటువంటి సుభాని, సాయిలకు తీవ్ర గాయాల లవ్వగా స్థానికులు 108 సాయంతో క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. జరిగిన ప్రమాద సంఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కూటమి ప్రభుత్వంలో ఆర్ఎంపి, పిఎంపి లకు గుర్తింపు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రోగులకు ప్రథమ చికిత్స ద్వారా సేవలు అందించే ఆర్ఎంపి, పిఎంపిలు దేవుళ్ళతో సమానమని మాజీ మంత్రి, ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్ లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ తెనాలి డివిజన్ స్థాయి 40వ మహాసభ నిర్వహించిన సభలో ఆలపాటితో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పట్టణంలోని మైత్రి వైద్యశాల, హిమనీ స్కానింగ్ సెంటర్ల సౌజన్యంతో నిర్వహించిన సభకు తెనాలి డివిజన్ ఆర్ఎంపి అండ్ పిఎంపి అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుండి గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపి పిఎంపి లకు ప్రభుత్వం నుండి గుర్తింపు కావాలన్న ఆశయం నెరవేరకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా ప్రభుత్వపరమైన గుర్తింపును అందించేందుకు తన వంతు కషి చేస్తానన్నారు. ఎన్నో ఆశలతో కూటమిపాలనకు ప్రజల నుండి మద్దతు తెలిపేందుకు గ్రామీణ వైద్యులు కృషి చేశారని వారికి అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వంలో అన్ని విభాగాలు పతనమైన మాట అందరికీ తెలుసునని విమర్శించారు. ఓటమి పాలనలో ఆర్ఎంపి పిఎంపీలకు గుర్తింపు వచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చిస్తామని అన్నారు. శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఆర్ఎంపి పిఎంపీలకు ప్రభుత్వ పరమైన గుర్తును లభింపు చేసే విధంగా అసెంబ్లీలో సంబంధించిన అంశాన్ని ప్రస్తావనకు తీసుకువచ్చి తన వంతు సహకరిస్తానని అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జిల్లా పరిషత్తు మాజీ చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం ద్వారా గుర్తింపు తెచ్చేందుకు జీవోను విడుదల చేయించడం జరిగిందని, అదే కార్యరూపం దాల్చక పోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. గ్రామీణ వైద్యుల ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గుంటూరు జిల్లా ఏపీ ఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు రాజా సిద్ధార్ధ మాట్లాడుతూ ఫెడరేషన్ ద్వారా అనేక సేవలను సభ్యులకు అందించడం జరుగుతుందని అన్నారు. కూటమిపాలనలో అనుకూలమైన జీవో విడుదల అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. సభలో తెనాలి డివిజన్ ప్రధాన కార్యదర్శి పుల్లారావు, కోశాధికారి రంగారావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుగుణేశ్వరి, రాష్ట్ర గౌరవ సలహాదారు ఎల్ ఎన్ రావు, ఫెడరేషన్ అధ్యక్షులు జివిస్ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్ఎంపిలను సత్కరించారు. తొలుత చిన్నారులు చేసిన నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. అసోసియేషన్ ద్వారా 400 మంది సభ్యులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

పింఛన్లపై నేటి నుండి పున:పరిశీలన

తేదీల వారీగా మండలాలు, పట్టణాలు ఎంపిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం మరియు పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో రీ ఎసెస్మెంట్, హెల్త్, వికలాంగుల పింఛన్ల పున:పరిశీలన కోసం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బాలు నాయక్, జిల్లా వైద్య శాఖాధికారి రవి, జిల్లా కో-ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ రంగారావు అధ్వర్యంలో ఐదు బృందాలుగా డాక్టర్లను అన్ని మండలాలకు కేటాయించారు. సోమవారం వీరు పరిశీలన చేపట్టనున్నారు. సోమవారం నరసరావుపేట మున్సిపాలిటీ, వినుకొండ మున్సిపాలిటీ, పిడుగురాళ్ల మండలం, కారంపూడి మండలం, అమరావతి మండలాలు, మంగళవారం నరసరావుపేట మండలం, వినుకొండ మండలం, పిడుగురాళ్ల మున్సిపాలిటీ, మాచర్ల మండలం, క్రోసూరు మండలాలు, 8వ తేదీన రొంపిచర్ల మండలం, ఈపూరు మండలం, దాచేపల్లి మండలం, మాచర్ల మున్సిపాలిటీ, బెల్లంకొండ మండలాలు, 16న చిలకలూరిపేట మండలం, బొల్లాపల్లి మండలం, గురజాల మండలం, వెల్దుర్తి మండలం, పెదకూరపాడు మండలాలు, 17న చిలకలూరిపేట మున్సిపాలిటీ, నూజండ్ల మండలం, మాచవరం మండలం, రెంటచింతల మండలం, అచ్చంపేట మండలాలు, 18న నాదెండ్ల మండలం, శావల్యాపురం మండలం, సత్తెనపల్లి మండలం, దుర్గి మండలాలు, 21న యడ్లపాడు మండలం, సత్తెనపల్లి మున్సిపాలిటీ, 22న రాజుపాలెం మండలం, 23న ముప్పాళ్ల మండలం, 28న నకరికల్లు మండలంలోని బెడ్ రిడెన్ పేషెంట్లను, వికలాంగులను మండలాల్లోని లబ్ధిదారుల వద్దకు వచ్చి డాక్టర్లు పరీక్షలు చేస్తారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు అందరూ తమ పరిధిలోని ఎన్టీఆర్ భరోసా ఫించను హెల్త్, వికలాంగుల, బెడ్ రిడెన్ లబ్ధిదారులను అందుబాటులో ఉండాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

చదరంగంతో ఏకాగ్రత

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

చదరంగం ఆడటం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని, ఈ క్రీడలో విద్యార్థులను ప్రోత్సహించాలని మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జున్నా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పల్నాడు చెస్ అకాడమీ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ సహకారంతో ఆదివారం స్థానిక కోదండరామ దేవాలయ ఆవరణలో యు-15 చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వాసవి క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు పోలూరి నరసింహారావు, జున్నా శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ చెస్ ఆడటం వల్ల విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతుందని, పోటీల ద్వారా విద్యార్థులు పోటీతత్వాన్ని, ఆత్మస్థైర్యాన్ని అలవర్చుకుంటారని అన్నారు. విద్యార్థుల్లో మేధోసంపతి పెరుగుతుందని, మానసికంగా విద్యార్థులు దృఢంగా ఉంటారని చెప్పారు. ఈ పోటీలలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు 200 ముంది పాల్గొన్నారు. వాసవి క్లబ్ అధ్యక్షులు భవనాసి రవితేజ, కార్యదర్శి బత్తుల వీరబ్రహ్మం, కోశాధికారి బచ్చు రాజ్ కుమార్, ఫాస్ట్ రీజియన్ చైర్మన్ మేడం నాగేశ్వరావు, ఫాస్ట్ ప్రెసిడెంట్ తిరివీధివెంకట నాగేశ్వరరావు, చుండూరు సత్యనారాయణ, చెస్ కోచ్ కిరణ్, జర్నలిస్ట్ పాపారావు పాల్గొన్నారు.

పోటీల్లో భాగంగా చెస్ ఆడుతున్న విద్యార్థులను పరిశీలిస్తున్న పోలూరి నరసింహారావు, ఇతర అతిథులు

కోటి ఆశలతో వరినాట్లు

- రబీకి పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు
- అంచనాలకు మించి సాగయ్యే అవకాశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఖరీఫ్‌లో మిగిలేదీమీ ఉండదని భావిస్తున్న రైతులు శక్తినంతా కూడదీసుకుని కోటి ఆశలతో రబీ సాగులో నిమగ్నమయ్యారు. నరసరావుపేట నియోజకవర్గంలో వరినాట్లు ఊపందుకుంటున్నాయి. రొంపిచర్ల మండలంలో మాచవరం, ఎడ్వర్డ్‌పేట, వి.రెడ్డిపాలెం, కొత్తపల్లి, విప్పర్ల, నల్లగార్లపాడు గ్రామాల్లో ఇప్పటికే నాట్లు ప్రారంభించారు. పల్నాడు జిల్లాలో 13 వేల ఎకరాల వరకు రబీ సాగుకు అవకాశాలున్నాయని వ్యవసాయ శాఖాధికార్లు చెబుతున్నా అంతకు మించడంతోపాటు ఈ నెలాఖరుకు వ్యవసాయ అధికారులు భావిస్తున్న లక్ష్యం మేరకు నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటికే 60 శాతం వరి సాగు చేపట్టారు. నరసరావుపేట నియోజకవర్గంలో 200 ఎకరాలకు పైగా వరి నాట్లు పూర్తయ్యాయి. 600 ఎకరాలకు పైగా నాటు వేసేందుకు పొలాలను రైతులు సిద్ధం చేసుకున్నారు. కొన్ని గ్రామాల్లో దమ్ములు పట్టేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

కలిసి రాని ఖరీఫ్

2024 ఖరీఫ్ సీజన్లో వరి సాగు రైతులకు కలిసి

రా లే ద నే

చెప్పొచ్చు. నారు పోసిన నాటి నుంచి నాట్లు వేసి కోత చేసే వరకు ఏ దశలోనూ పంటకు వాతావరణం అనుకూలించలేదు. రైతులను ఏదో ఒక సమస్య వెంటాడుతునే వచ్చింది. సీజన్ ప్రారంభంలో వర్షాలు అనుకూలించి సకాలంలో నాట్లు వేసినా పంట చేతికొచ్చే సమయంలో వానలొచ్చి పంట పూర్తిగా నేల వాలి నూర్పిడికి అదనపు ఖర్చులయ్యాయి. ధాన్యం రంగు మారడమూ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

పొలం వద్ద చెరువులు, మోటారు బోర్లున్న రైతులు సకాలంలో నాట్లు వేయగలిగారు. వర్షాలపై ఆధారపడ్డ రైతులు ఆలస్యంగా, ముదిరిన నారుతో నాట్లు వేయాల్సి వచ్చింది. పంటను ప్రారంభంలో ఆకు ముడత, పొడ, సుడిదోమ వంటి తెగుళ్ల ఆశించగా, కంకులు ఏర్పడే దశలో కంకి నల్లి తెగులు సోకింది. వీటి నివారణకు పురుగు మందుల కోసం రైతులు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది. కోత దశలో తాటాకు తెగులు ఆశించింది. డిసెంబర్‌లో వర్షాలతో వరి నేల వాలడంతో 10 నుంచి 20 శాతం పంట నేల పాలు కావడంతో పంట నాణ్యత దెబ్బతింది. డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన తుపాను పంటకు కొంత వరకు నష్టం చేయగా, మూడో వారంలో కురిసిన వానలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. కొన్నిచోట్ల ధాన్యం మొలకలు వచ్చాయి. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడం, వాతావరణం సహకరించకపోవడంతో రైతులు నష్టపోయినా ప్రభుత్వం నుంచి సాయం కరువైంది. పెట్టుబడి సాయం కూడా రాష్ట్ర ప్రభుత్వం అందించలేదు. రబీ సీజన్ అయినా కలిసొస్తుందేమోనన్న ఆశతో కొంతమంది రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నారు.

రబీలోనే అధిక దిగుబడులు

పి.మస్తానమ్మ, ఎడిఎ, నరసరావుపేట సబ్ డివిజన్

రబీ సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటు ఉన్నాయి. నీటి వనరులు ఉన్న రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలించే వంగడాలను సాగు చేయాలి. వాతావరణం అనుకూలిస్తే ఖరీఫ్ కంటే రబీ సీజన్లోనే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చు. దమ్ములో ఎకరానికి 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్, వంద కిలోల సూపర్ పాస్పేట్ చల్లాలి. దమ్ము చేసిన మూడు రోజుల తర్వాత నాట్లు వేస్తే మంచిది. దగ్గర దగ్గరగా నాట్లు వేయాలి. వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించాలి.

సాగర్ నీరు నేరుగా బొప్పూడికి తెస్తాం

బైపాస్ బాధిత రైతులకు తప్పకుండా న్యాయం - అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాల రూపురేఖలు మారుస్తామని, రోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ భవనాలు, తాగునీటి సౌకర్యంతో పాటు అన్ని రకాల వసతులతో రాష్ట్రంలోని గ్రామాలన్నీ కళకళలాడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని బొప్పూడిలో రూ.35.23 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సహా ఎందరో ప్రముఖులు ఈ గ్రామానికి వచ్చి ఇక్కడ అభివృద్ధిని చూశారన్నారు. గ్రామానికి సాగునీటి లిఫ్టులు, బైపాస్ రహదారి అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. 2019 ఎన్నికల్లో ఎక్కడినుంచో వచ్చిన వారిని గెలిపించిన ఫలితం ఇప్పటికీ అనుభవిస్తున్నామన్నారు. అంతా సక్రమంగా జరిగితే ప్రధాని ద్వారా చిలకలూరిపేట బైపాస్ ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. బైపాస్ నిర్మాణానికి భూములిచ్చిన ప్రతి రైతుకీ న్యాయం చేసే తీరుతామని చెప్పారు. బైపాస్ రహదారుల నిర్మాణానికి సంబంధించి త్వరలోనే కేంద్రప్రభుత్వం కొత్త విధివిధానాలు ఖరారు చేయనుందని, అవి రహదారుల నిర్మాణానికి భూములిచ్చే రైతులకు న్యాయం చేసేవిగానే ఉంటాయని అన్నారు. బొప్పూడి ఆంజనేయస్వామి గుడి కంటే మిన్నగా కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి గుడిని అభివృద్ధి చేస్తామని, అవసరమైతే టిటిడిని సంప్రదించి నిధులు సమకూరుస్తామని అన్నారు. అమృతధార, జల్ జీవన్ మిషన్ పథకాల్లో భాగంగా బొప్పూడిలో ప్రతిఇంటికీ తాగు నీరు అందించే ప్రాజెక్ట్‌ను త్వరలోనే అమల్లోకి తెస్తామన్నారు. సాగర్ నుంచి నీరు నేరుగా బొప్పూడిలోని వాటర్ హెడ్ ట్యాంక్‌కు వచ్చేలా ఏర్పాటు చేస్తామన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంపైనా దృష్టి పెడతామని చెప్పారు.

అంధుల బాలికల హాస్టల్‌కు మాజీ ఎమ్మెల్యే వితరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని అంధుల బాలికల వసతి గృహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 10 క్వింటాళ్ల బియ్యాన్ని వితరణిచ్చారు. రామిరెడ్డిపేటలోని పెద్దపల్లి రత్నకుమారి, శ్రీనివాస్ అంధుల స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ఈ హాస్టల్‌లో ఈనెల 11వ తేదీన బ్రెయిలీ జయంతి సందర్భంగా జరుగునున్న వేడుకలకు అంధుల స్వచ్ఛంద సేవా సంస్థలకు వితరణ చేసినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొన్నేళ్లుగా సహాయ సహకరాలు అందిస్తున్నామని, సేవాదృక్పథం ఉన్న అందరూ తమకు తోచిన సాయం చేయాలని కోరారు.

బొల్లాపల్లిలో నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - వినుకొండ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రమైన బొల్లాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తారని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జరిగే కార్యక్రమంలో నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని, స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడే తక్షణం పరిష్కార చర్యలు చేపట్టేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యలు, శాంతిభద్రతలు, పథకాల అందుబాటులో సమస్యలు సహా ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తేవొచ్చని, అన్నివిభాగాల అధికారులు కూడా అక్కడే అందుబాటులో ఉంటారని, మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ప్రజాప్రతినిధులు, శాఖల వారీగా అధికారులతో ఎమ్మెల్యే సమీక్షిస్తారని తెలిపారు.

సుందరయ్య నగర్‌లో కోలాహలంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

సుందరయ్యగర్‌లో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహ పూరిత వాతవరణంలో జరిగాయి. బాలలు, పెద్దలు పోటీపడి మరీ ఆటపాటల్లో పాల్గొన్నారు. దాదాపు 400 మంది మహిళల రంగవల్లులు, బాలల కేరింతలతో ఈ సంబరాల్లో పాల్గొన్నారు. నిర్వాహకులను అభినందించారు.

తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్ బత్తుల రాజు భవన్ వద్దఆదివారం 10 రకాల ఆటల పోటీలను భవన నిర్మాణకార్మిక సంఘం, మహిళా సంఘం, యువజన సంఘం, ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు నిర్వహించారు.మహిళలకు ముగ్గుల పోటీలు, టగ్గాఫ్‌వార్, వాటర్ ఫిల్లింగ్, పిల్లలకు రన్నింగ్ రేస్, స్కిప్పింగ్, బకెట్ ఇన్ వాటర్, యువకులకు ఉట్టి కొట్టుడు, వంటి పది రకాల ఆటలను నిర్వహించారు. పండుగ వాతావరణం తలపించేలా షుమారు400 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ ఆటల పోటీలను సిపిఎం సీనియర్ నాయకులు పి రామచంద్రరావు ప్రారంభించారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉత్సాహపూరితమైన వాతావరణంలో మహిళలు, పిల్లలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని తమ తమ ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమం లో మహిళా సంఘం తాడేపల్లి పట్టణ నాయకురాలు పి.గిరిజ, గోవిందమ్మ, అంజలి, సుధ, ప్రజానాట్యమండలి తాడేపల్లి పట్టణ నాయకులు కొట్టే కరుణాకర రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం తాడేపల్లి పట్టణం గౌరవ అధ్యక్షులు సిహెచ్ భుజంగరావు, బి శేఖర్, సాయి, ఫణి, సుబ్బయ్య, శ్యామ్, వెంకటేశ్వర్లు, బి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచే బిజెపిని వ్యతిరేకించండి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ప్రజాస్వామ్య వ్యవస్థను తూట్లు పొడిచే మతోన్మాద బిజెపిని వ్యతిరేకించాలని, సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరారెడ్డి, నేతాజీ సెంటర్‌లో ఆదివారం సిపిఎం శ్రేణులు, భారత రాజ్యాంగాన్ని మతసామరస్యాన్ని కాపాడాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ, విస్తత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి బిజెపి పరిపాలనలో పెనుముప్పు ఏర్పడిందని అన్నారు. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలందరూ ఐక్యంగా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో భారత రాజ్యాంగ పరిపాలనకు బదులు, మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు బిజెపి పూనుకోవటం దుర్మార్గమని అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడు లేని విధంగా బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడమే కాక, ప్రజలపై భారాలు మరింతగా వేసిందని ఆయన మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడం వలన నిత్యవసర వస్తువులపై ధరల ప్రభావం పడి సామాన్య ప్రజలు అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు. ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, విద్యుత్ చట్ట సంస్కరణలు వలన ట్రూ అప్ చార్జీలు, అదనపు చార్జీల పేరుతో మరొక భారం ప్రజల నెత్తిన పడిందని, సామాన్య ప్రజలు బ్రతికే పరిస్థితి లేదన్నారు. ప్రజా వ్యతిరేక బిజెపి విధానాలను వ్యతిరేకించా లని, పెంచిన విద్యుత్ ఛార్జీలను, అధిక ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు దొంతి రెడ్డి విజయభాస్కర రెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, దర్శనపు విజయ్ బాబు, కోట బాబురావు, ఎండి బాజ్జీ, ఎం మేరీ ఎం దావీదు తదితరులున్నారు.

తాడేపల్లి పట్టణం అమరారెడ్డి నగర్ లో మాట్లాడుతున్న బూరుగ వెంకటేశ్వరరావు

చేబ్రోలులో కార్మికుల తొలగింపు చట్టాల ఉల్లంఘనే

ప్రజాశక్తి - చేబ్రోలు

ఐదో రోజుకు కార్మికుల నిరసన

చేబ్రోలులో అక్రమంగా తొలగించిన పంచాయతీ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి కోరుతూ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన ఐదో రోజుకు చేరింది. ఆదివారం ఉదయం ఏడు గంటలకు చేబ్రోలు లోని ఎన్టీఆర్ విగ్రహం నుండి డిగ్రీ కాలేజీ వరకు ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడం చేతగాని అధికారులు వ్యక్తిగత బెదిరింపులకు పాల్పడటం బాధాకరమని అన్నారు. ఆందోళన చేస్తున్న కార్మికుల కుటుంబాల దగ్గరకు వెళ్లి మీ పెన్షన్లు ఆపివేస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చూస్తామని బెదిరించడం, ప్రలోభాలకు గురి చేయడం ఏ సంస్కృతికి నిదర్శనం అని ఆయన ప్రశ్నించారు. చేబ్రోలు మండలంలోని పంచాయతీ అధికారులు కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నారని అన్నారు. అణిచివేత ద్వారా ఉద్యమాల ఆగుతాయని భ్రమపడితే అది వారికి పగటి కలగానే మిగిలిపోతుందని హెచ్చరించారు. తక్షణమే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసరావు, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ హనుమంతరావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాఘవమ్మ, పార్వతి, వెంకాయమ్మ, సరళ, జ్యోతి, దివ్యశ్రీ, దీపిక పాల్గొన్నారు.

కార్మికుల నిరసన ప్రదర్శనలో నాయకులు దండా లక్ష్మీనారాయణ, చింతల శ్రీనివాసరావు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ

ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

స్త్రీల విద్యాభివృద్ధికి కృషిచేసిన తొలితరం మహిళా ఉద్యమ కారిణి సావిత్రిబాయి పూలే అని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ అన్నారు. సావిత్రిబాయిపూలే 193వ జయంతి వారోత్సవాల సందర్భంగా గుంటూరు నగరంలో బ్రాడీపేట ఆఫీసు, సుందరయ్యనగర్, అంబేద్కర్ నగర్‌లో కార్యక్రమాలు జరిగాయి. మహిళలకు చదువు కావాలని, చదువు ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలరని సావిత్రిబాయి పూలే ఎంతోమందికి చదువు నేర్పించడమే కాకుండా ఎన్నో స్కూళ్లను స్థాపించడంలో పూలే దంపతులు ఎనలేని కృషి చేశారన్నారు. ఆడపిల్లల చదువు కోసం పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్తను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి అని అన్నారు. ఎన్నో అవమానాలను దాడులను ఎదుర్కొని కూడా మహిళా విద్యకోసం కృషి చేశారన్నారు. అలాంటి మహనీయులను స్మరించుకోవడం ఎంతో మంచిది అని అన్నారు. ఈకార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు జి.రమణ, ఏ.కళ్యాణి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కె.పద్మ, అంగన్‌వాడీ నాయకులు టి.రాధా, సంధ్య, సుజనారాణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

పట్టణ మేదర సంఘం అధ్యక్షులుగా కనికరం యోగేష్

ప్రజాశక్తి - తెనాలిరూరల్

పట్టణ మేదర సంఘ అభివృద్ధికి సహకరిస్తానని మాజి మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక బాలాజీ రావు పేట పట్టాభి రామస్వామి దేవస్థానంలో జరిగిన మేదర సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో మాజి మంత్రి, కృష్ణ గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. పట్టణ మేదర సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కనికరం యోగేష్, కార్యదర్శిగా జిరస్తా హేమంత్, కోశాధికారిగా సెనగవరపు ప్రసాద్ కార్యవర్గ సభ్యులచేత సంఘ సీనియర్ నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మేదర సంఘాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. మేధావుల సంగీత సంక్షేమం అభివృద్ధి కోసం తనవంతుగా పూర్తిస్థాయిలో సహాయ సహకారిగా ఉంటానని హామీ ఇచ్చారు. మేదర సంఘీయులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కులవృత్తులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందే విధంగా చేస్తామని చెప్పారు. నూతనంగా ఎన్నిక అయిన కనికరం యోగేష్ మరియు కార్యవర్గ సభ్యులకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులకు మేదర సంఘం సీనియర్ నాయకులు సభ్యులు అభినందనలు తెలిపారు. ఆ కార్యక్రమంలో ఎం వెంకట మోహన ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల పట్టణంలోని కోదండ రామాలయం వద్ద ఆదివారం పట్టణ రజక సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. రజక సంఘం నూతన అధ్యక్షులుగా భీమవరపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా దేవనపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా మొగిలి వెంకట శ్రీనివాసరావు, ఉప కార్యదర్శి ఎద్దుల శ్రీనివాసరావు, ట్రెజరర్ తుపాకుల మల్లికార్జునరావు, గౌరవ సలహాదారుడు భీమవరపు లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యులుగా కందారపు లక్ష్మయ్య, ముదిన తిరుపతిరావు, స్వర్ణ వెంకయ్య, భాగం హనుమంతరావు ఎన్నికయ్యారు.

12న రాష్ట్రస్థాయి సినీ పాటల పోటీలు

ప్రజాశక్తి- మాచర్ల

సంక్రాంతి పండగను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఈనెల 12న తెలుగు రాష్ట్రాల స్థాయి సినీ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ సాంస్కృతిక శాఖ చైర్మన్ డాక్టర్ ఎం.కమలహాసన్‌రావు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 22వ తెలుగు రాష్ట్రాల స్థాయి పాటల పోటీలను స్థానిక మానుకొండ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విజేతలకు ప్రథమ, ద్వితీ, తృతీయ బహుమతులు వరుసగా రూ.6 వేలు, రూ.4వేలు, రూ.3 వేలు అందించనున్నట్లు తెలిపారు. 10 ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. వివరాలకు 94410 65681 నంబరును సంప్రదించాలని కోరారు. సమావేశంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు బీవీ సుబ్బారావు, కార్యదర్శి అమరేంద్ర, కోశాధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - దాచేపల్లి : మండల పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులకు ఆదివారం జీవన ధ్రువపత్రాలు అందజేశారు. స్థానిక నారాయణపురంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నిర్వహించారు. అనంతరం మ్యాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేపట్టారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుర్రి కృష్ణారెడ్డి, బెహర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తురకా కిషోర్ అరెస్ట్‌లో ఎస్ఐ కి అభినందనలు

ప్రజాశక్తి- విజయపురిసౌత్

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు తురకా కిషోర్‌ను నాగార్జునసాగర్, విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం అరెస్ట్ చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన తురకా కిషోర్ ఆచూకీ పోలీసులకు సవాలుగా మారింది. నెలలు గడుస్తున్నా నిందితుడిని పట్టుకోకపోవడంతో పోలీసుల తీరుపై విమర్శలు వచ్చాయి. దాంతో నాగార్జునసాగర్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ.. తురకా కిషోర్ ను పట్టుకోవడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. వారం రోజులుగా ఎస్ఐ షఫీ తన సిబ్బందితో తురకా కిషోర్ కోసం పలు ప్రాంతాల్లో తీవ్రంగా గాలించారు. చివరికి పక్కా సమాచారంతో హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై షఫీపై ప్రసంశలు కురుస్తున్నాయి.

వేగం కంటే.. ప్రాణం మిన్న!

- మంచు కురిసే వేళలో ప్రయాణం.. ప్రమాదకరం
- డీఎస్పీ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రస్తుతం ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయి, పొగమంచు దట్టంగా కమ్ముకుని, ఉదయం 8 గంటలైనా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనిపించని పరిస్థితులు ఏర్పడుతున్నాయని.. దీని వల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 'ప్రజాశక్తి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడుతూ.. పొగ మంచు మాటున ప్రమాదం పొంచి ఉందన్నారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లపై పొగమంచు ఏర్పడటం వల్ల ప్రయాణం ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని తెలిపారు. వాహనాల నుంచి వెలువడే పొగ కారణంగా మంచు మరింత దట్టంగా మారుతుందని, వాహనానికి లైట్లు వేసుకున్నా.. ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించవని చెప్పారు. ఈ సమయంలో వేగంగా ప్రయాణం చేస్తే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. ఫిబ్రవరి నెల చివరి వరకు పొగ మంచు అధికంగా ఉంటుందని.. వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తప్పని పరిస్థితుల్లో మాత్రమే మంచు కురిసే సమయంలో ప్రయాణం చేయాలని డీఎస్పీ సూచించారు. వాయు కాలుష్యం కారణంగా ఎక్కువ దూరాన్ని చూడలేకపోతున్న ఈ రోజుల్లో పొగమంచు వల్ల ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. తక్కువ బీమ్ హెడ్‌లైట్‌లను సెట్ చేసుకోవడం మంచిదన్నారు. హై-బీమ్ హెడ్‌లైట్లను ఉపయోగించడం వల్ల పొగమంచు కాంతికి రిఫ్లెక్ట్ అవుతూ ప్రమాదాలకు దారి తీయవచ్చని తెలిపారు. 100 మీటర్ల కంటే తక్కువ దూరంలో ఉన్న వాహనాన్ని చూడలేని సమయంలో కారు ఫాగ్ ల్యాంప్ ఆన్ చేయడం మంచిదని చెప్పారు. 100 మీటర్ల కంటే తక్కువ దూరంలో ఉన్న వాహనాన్ని చూడలేని సమయంలో, సడెన్‌గా వచ్చే వాహనాన్ని చూసి త్వరగా స్పందించలేమన్నారు. పరిమిత వేగంలో ప్రయాణిస్తున్నట్లయితే పరిస్థితులకు త్వరగా స్పందించవచ్చని.. కనిపించని ట్రాఫిక్ శబ్దాలను విని, వాహనాల దూరాన్ని అంచనా వేయవచ్చని ఆయన తెలిపారు. వేగం కంటే ప్రాణం మిన్న అని.. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సమస్యల వలయంలో చిలకలూరిపేట ఆర్టీసీ డిపో

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక ఆర్టీసీ డిపో సమస్యల వలయంలో కూరుకుపోయింది. జాతీయ రహదారి పక్కనే ఉండటం.. విజయవాడకు వెళ్లే ప్రధాన రహదారులు వయా చిలకలూరిపేట మీదుగానే కావడంతో నిత్యం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. అమరావతికి దగ్గరలో ఉండటం వల్ల రాత్రీ పగలు తేడా లేకుండా అనేక అవసరాల నిమిత్తం నిత్యం లక్షల మంది ప్రయాణికులు ఈ డిపో నుంచి ప్రయాణం చేస్తుంటారు. వీరికి కనీస సౌకర్యాలు కల్పించడంలో స్థానిక డిపో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సీసీ కెమెరాలు ఉన్నా పని చేయకపోవడం వల్ల దొంగతనాలు, అరాచక శక్తులకు అడ్డాగా మారిపోయింది. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులకు అత్యవసర సమయంలో బహిరంగ మలవిసర్జన తప్పడం లేదు. దూర ప్రాంతాలు, ఇతర డిపోల బస్సులను ఒక వైపు.. చిలకలూరిపేట డిపోకు సంబంధించిన బస్సులకు మరోవైపు ప్లాట్‌ఫారాలు కేటాయించడంతో ప్రయాణికులు.. ప్రధానంగా నిరక్షరాస్యులు అయోమయానికి గురవుతున్నారు. ఒక బస్సు ఎక్క బోయి, మరో బస్సు ఎక్కుతున్న సం ఘటనలు నిత్యం జరుగుతున్నాయి. కనీసం మైకు ద్వారా ప్రచారం చేసినా ప్రయోజనకరంగా ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. కనీసం బస్సు సమాచారం అడుగుదామన్నా.. ఎవరూ ఉండటం లేదని అంటున్నారు.

నిర్వహణ శూన్యం..

కాంప్లెక్స్ పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. నిర్వహణ కూడా ఉండటం లేదు. బస్టాండ్ ఆవరణలో కనీసం ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసే పరిస్థితి లేదు. ఆవరణలో ఎక్కడైనా పెడితే జరిమానాలు వేస్తున్నారని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు. మరోవైపు సెల్‌ఫోన్‌దొంగలు.. తమ చేతులకు పని చెబుతున్నారు. ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా ఫోన్లు పోతున్నాయని పలువురు బాధితులు తెలిపారు. దీనిపై ఫిర్యాదు తీసుకునే వారే ఉండటం లేదని చెబుతున్నారు. ప్రయాణికులకు రెస్ట్ రూమ్ సౌకర్యం కల్పించాలని, దాతలు ఉచితంగా ఇచ్చిన మంచినీటి ఆర్వో ప్లాంట్‌ను బాగు చేయించి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు. సమస్యలను పరిష్కరించి, ప్రయాణికులకు బస్టాండ్ పూర్తిస్థాయిలో అందుబాటులో వచ్చే విధంగా ఆర్టీసీ అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

స్థానిక శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం మహిళా సాధికారత విభాగం, మాచర్ల పట్టణ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపరెడ్డి లక్ష్మి, రోటరీ క్లబ్ గవర్నర్ రామకోటయ్య, ప్రోగ్రాం కన్వీనర్ పటాన్ నాగూర్ వలి తదితరులు పాల్గొని మాట్లాడారు. నేటి కాలంలో అత్యంత ఆదరణ కలిగిన వృత్తి అయిన ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో ప్రావీణ్యం సంపాదించడానికి తొలి అడుగులు టైలరింగ్ ద్వారా సాధ్యమవుతాయని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న రోటరీ ప్రతినిధులు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.శుభ తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులకు పాఠశాల స్థాయిలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ వివిధ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పి.నరేంద్ర, వైస్ చైర్మన్ అనిల్ కుమార్, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, నీలిమ, ఎన్.అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల అందజేత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట ఆదిత్య బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో పలువురు బ్రాహ్మణ సామాజిక వర్గీయులకు నూతన వ్రస్తాలను అందజేశారు. సంఘ అధ్యక్షులు ఏకామారుతీ శర్మ, చిలకలూరిపేట సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ, సంఘ కార్యదర్శి పోలూరి చంద్రమౌళి, గౌరవాధ్యక్షులు చల్లా విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉచిత వివాహ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు..

ప్రజాశక్తి - యడ్లపాడు

విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ప్రముఖ దినపత్రిక జర్నలిజం స్కూల్ మాజీ ఫ్యాకల్టీ సభ్యులు కాళహస్తి సుబ్బారావు తెలిపారు. ఆదివారం లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9, 10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు దూరదృష్టి, చదువుపట్ల ఆసక్తి, క్రమశిక్షణ, ఉన్నత స్థాయికి ఎదగాలనే బలమైన కోరిక, విద్యా సంబంధమైన నైపుణ్యాలు పెంపొందించుకోవడం వంటి లక్షణాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి.రామిరెడ్డి, ఉపాధ్యాయులు డి.సుధాకర్, యు.మల్లేశ్వరి, గ్రామ పెద్దలు నంబూరు శివరామకృష్ణయ్య, గోగడ హరిబాబు, గుంటుపల్లి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సంఘాల సమావేశం

ప్రజాశక్తి - దాచేపల్లి

కొత్తగా ఏర్పడిన నీటి సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు సోమవారం పిడుగురాళ్లలోని డీఈ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నీటిపారుదల శాఖ ఏఈ పసుపులేటి ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో నూతనంగా ఏర్పడిన కార్యవర్గానికి సాగులో వచ్చే సమస్యలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా సాగునీటి కాలువల నిర్వహణ, రైతుల సమస్యల పరిష్కారాలు, ప్రభుత్వ నిధుల వినియోగంపై అవగాహన సదస్సు ఉంటుందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

యాజమాన్యాల పక్షానే కూటమి ప్రభుత్వం

దీక్షల్లో కూర్చొన్న కార్మికులు, మద్దతు తెలుపుతున్న నాయకులు

➤ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని మంత్రి లోకేశ్ నిలబెట్టుకోవాలి

➤ 33వ రోజుకు ఏసీసీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

తమకు నష్టపరిహారం ఇవ్వాలని 33 రోజులుగా ఏసీసీ కార్మికులు న్యాయపోరాటం చేస్తుంటే.. కూటమి ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్లయినా లేదని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేకుండా, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏసీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 33వ రోజుకు చేరాయి. ఈ దీక్షలను వేముల దుర్గారావు, రాచకొండ శివ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలక పక్షాలు ఎన్ని మారినా కార్మికుల సమస్యలు పట్టించుకునే వారు లేరని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కంపెనీ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే నారా లోకేశ్.. తాను ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే విధంగా జోక్యం చేసుకోవాలని, ఏసీసీ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలలో వై.యెహోషువ, సిహెచ్.పిచ్చయ్య, ఇస్మాయిల్, సక్రు నాయక్, బి.నవనీతం తదితరులు కూర్చొన్నారు. పలువురు నాయకులు కార్మికుల దీక్షలకు సంఘీభావం తెలిపారు.

ప్రాంతీయ పశు వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు రూ.3 లక్షల వ్యయంతో మరమ్మతులు చేసిన ప్రాంతీయ పశు వైద్యశాలను డీజీఈ డాక్టర్ రాంప్రసాద్, గుంటూరు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాంతీయ పశు వైద్యశాలకు మరమ్మతులు చేసి ఆధునికీకరణకు కృషి చేసిన రోటరీ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, పశు వైద్యశాల వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, రొటేరియన్స్ అన్నే రత్న ప్రభాకర్, అనిల్ చక్రవర్తి, వి.శ్రీనివాసరావు, అందే మురళీకష్ణ, ప్రగడ రాజశేఖర్, కె.సుందరయ్య, టిడిపి గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరు మైనర్ బాబు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు చేదోడుగా యూటీఎఫ్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలంలోని ఉద్యోగ పెన్షనర్లకు 'జీవన్ ప్రమాణ్' ద్వారా లైఫ్ సర్టిఫికెట్‌ను ఉచితంగా ఆన్‌లైన్ చేయనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. యూటీఎఫ్ ప్రత్తిపాడు మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ చేశారు. సర్టిఫికెట్ పొందాలనుకునేవారు చంద్రశేఖరరెడ్డి, శంకర్‌రెడ్డిలను సంప్రదించాలని కోరారు.

'ఒకే రాష్ట్రం.. ఒకే మాజీ సైనికుల సంక్షేమ సంఘం'

ప్రజాశక్తి మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాజీ సైనికుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు మాజీ సైనికుల సంక్షేమ సంఘం ధన్యవాదాలు తెలియజేసింది. మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్ సమావేశ మందిరంలో ఆదివారం 'ఒకే రాష్ట్రం-ఒకే మాజీ సైనికుల సంక్షేమ సంఘం' ఏర్పాటు చేసేందుకు చర్చించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా మాజీ సైనిక సంఘం అధ్యక్షులు కె.గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పలు మాజీ సైనిక సంక్షేమ సంఘాలు ఉన్నాయని, ప్రస్తుతం అన్ని సంఘాలనూ ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఒకే మాజీ సైనిక సంక్షేమ సంఘం ఉండాలన్న లక్ష్యంతో వైజాగ్ తదితర ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించామని చెప్పారు. మరో మూడు మాసాల్లో సంఘాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరి వెటర్న్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు శంకర్ రెడ్డి, బాపట్ల జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కటకం పూర్ణచంద్రరావు, రాజమండ్రి స్టేట్ నేవల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సూరి రెడ్డి శివకుమార్, కర్నూలు జిల్లా అధ్యక్షులు పేరయ్య చౌదరి, అనంతపురం జిల్లా అధ్యక్షులు పి.విశ్వేశ్వరరావు, కడప నుంచి ఎస్.ఎస్.రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-మంగళగిరి

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, వారి సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత యువజన సమాఖ్య గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే వలి విమర్శించారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో మంగళగిరి నియోజకవర్గ మహాసభలను జాలాది నవీన్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.చైతన్య, చిన్ని తిరుపతయ్య, ప్రభాకర్, కె.కాసియా పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఇంటూరి గోపీరాజ్, ప్రధాన కార్యదర్శిగా జాలాది నవీన్, ఉపాధ్యక్షుడిగా కంచర్ల క్రాంతి, సహాయ కార్యదర్శిగా ఉయ్యాల నరసింహ ఎన్నికయ్యారు.



గ్రంథాలయం పనివేళల్లో మార్పు

ప్రజాశక్తి-మంగళగిరి

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో మంగళగిరి పట్టణంలోని శివాలయం రోడ్డులో ఉన్న గ్రంథాలయం పని వేళల్లో మార్పులు చేశారు. పోటీ పరీక్షల అభ్యర్థుల అభ్యర్థన మేరకు ఇకపై ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంచనున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు నారకోడూరు విద్యార్థి

ప్రజాశక్తి-చేబ్రోలు

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారకోడూరు విద్యార్థి ఎస్కే నజ్మా అర్హత సాధించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చి, అనంతరం ఆదివారం గుంటూరు జిల్లా సైన్స్ ఫెయిర్‌లో ఉత్తమ ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయికి ఎన్నికైన నజ్మాను జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక మెమొంటో, మెరిట్ సర్టిఫికెట్ ఇచ్చి అభినందించారు. ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం తయారు చేసిన సర్వింగ్ రోబోట్ ఎగ్జిబిట్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎన్నికైందని హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన క్విజ్ పోటీల్లో జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మౌర్య భూషణ, కె.బాల భవ్యశ్రీ, కె.హారిక తృతీయ స్థానం సాధించారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గౌస్ మీరా, గైడ్ టీచర్ ఎన్.అరుణకుమారి, దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

11న ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-తెనాలి

ఈనెల 11న కాజీపేటలో శ్రీ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు మూర్తి మామిడి తోటలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.చంద్రిక తెలిపారు. అవగాహన సదస్సులో తెలంగాణ జీఎస్టీ జాయింట్ కమిషనర్ వై.శ్రీలీల ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రాకృతిక వ్యవసాయ పద్ధతులపై సుభాష్ పాలేకర్ కృషి విధాన సాధకులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితునికి చేయూత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

తాడేపల్లి పట్టణంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితునికి అంజాద్ బేగ్ సయ్యద్ మహమ్మద్ అనే ఎలక్ట్రీషియన్ చేయూత అందించారు. ఫ్రిజ్‌ను కొనుగోలు చేసి, ఆ కుటుంబానికి అందజేశారు.

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని ఉండవల్లి మెడ్ సిటీ వద్ద పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్, లూపిన్ డయగ్నోస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జొన్నా రాజేష్ మాట్లాడుతూ.. సుమారు వందమందికి పైగా పది రూపాయల నామమాత్రపు ఫీజుతో పరీక్షలు చేయించినట్లు చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు.

అక్రమాలకు అడ్డాగా..

పెదకాకాని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. ప్రైవేటు వ్యక్తుల చేతిలో కార్యాలయ బాధ్యతలు ఉండటం విమర్శలకు తావిస్తోంది. అటెండర్ పని దగ్గర నుంచి కార్యాలయంలో లంచాల వరకు వారిదే కీలక పాత్ర అన్న ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయం పరిధిలో 15 మంది స్టాంపు వెండర్లు ఉన్నా.. స్టాంపుల కొరత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఫీజు టు ఫీజు పేరుతో 0.5 పర్సంటేజీ నుంచి ఒక పర్సంటేజ్ వరకు ప్రజల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. వ్యక్తిగత సవరణల కోసం సుమారు రూ.30 వేల వరకు ప్రైవేటు వ్యక్తులకు చెల్లిస్తేనే గానీ పని జరగని పరిస్థితి. నైట్ వాచ్ మెన్ లేకున్నా పెట్రోలింగ్ రిజిస్టర్‌లో ఉన్నట్లు చూపిస్తున్నారు. కార్యాలయం పరిధిలో ఎక్కడా అవినీతి నిరోధక శాఖ అధికారుల సమాచార బోర్డు లేకపోవడం గమనార్హం. ఇదే సబ్ రిజిస్ట్రార్‌పై గతంలో పనిచేసిన చోటు పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. కార్యాలయంలో జరుగుతున్న లోపాలపై సబ్ రిజిస్ట్రార్‌ను వివరణ కోరగా.. మాట దాటవేసే ధోరణితో వ్యవహరించారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఆనందోత్సవాలతో రోటరీ 'కేరింత'

ప్రజాశక్తి-మంగళగిరి

పెదవడ్లపూడి డీబీఎన్ గార్డెన్లో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో ఆదివారం కేరింత అనే వినూత్న కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరి, తాడేపల్లి, తెనాలి, గుంటూరు రోటరీ క్లబ్‌లకు చెందిన కుటుంబాలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా తోటలో ఆటలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కౌన్సిలర్ క్లబ్ అడ్మినిస్ట్రేషన్ అన్నే రత్న ప్రభాకర్ మాట్లాడుతూ స్నేహం, సేవ అనే ప్రధాన లక్ష్యాలతో రోటరీ పనిచేస్తుందన్నారు. రోటరీ ప్రతినిధుల మధ్య ఐక్యత ఉంటే ఎన్నో సేవా కార్యక్రమాలు చేయవచ్చని, అలాంటి ఐక్యతకు కేరింత వంటి కార్యక్రమాలు సభ్యులకు బలాన్ని చేకూర్చుతాయన్నారు.

ఉద్యోగినుల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార సంస్థ, గుంటూరు వారి ఆధ్వర్యంలో స్థానిక మహిళా ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన మహిళా ఉద్యోగినుల వసతి గృహం (సఖి నివాస్)లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని నూతనంగా నిర్మించిన సఖి నివాస్ భవనాన్ని ఈనెల 21న ప్రారంభించటం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి ఉపాధి కోసం సొంత గృహాలను వదిలి పెట్టి పట్టణాలకు వచ్చారని, అటువంటి మహిళలు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సురక్షితమైన, సౌకర్యవంతమైన ఉండే వసతిని ప్రోత్సహించటానికి ప్రభుత్వం సఖి నివాస్ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ స్కీమ్‌లో భాగంగా హాస్టల్‌లో రుచికరమైన భోజనం, బెడ్స్, ఫ్యాన్లు, విశాలమైన డార్మిటరీ, తగినన్ని వాష్ రూమ్స్, టాయిలెట్స్ నీటి సౌకర్యంతో పటిష్టమైన రక్షణ వ్యవస్థ, ఇంటర్‌నెట్, వైఫై సౌకర్యాలతో, ఇతర హాస్టల్స్ కంటే తక్కువ ఫీజుతో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మొదటిగా వచ్చిన వారికి మొదటిగా అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 8333921344 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే అప్పగించాలని 7న సదస్సు

పజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో ప్రవేశపెట్టనున్న విద్యుత్ బస్సులను ప్రైవేటు సంస్థల ద్వారా కాకుండా నేరుగా ఆర్టీసీకే ఇవ్వాలని కోరుతూ జనవరి 7వ తేదీన విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టివిజి రవిశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సదస్సులో ఆర్టీసిలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. విద్యుత్ బస్సుల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు ఇవ్వడంవలన ఆర్టీసీ సంస్థలో ఉద్యోగులందరూ మిగులుగా మారతారని, ఆర్టీసీ గ్యారేజీలన్నీ మూతపడతాయని, క్రమంగా ఆర్టీసీ నామమాత్రంగా మిగులుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ బస్సుల పాలసీలో ఆర్టీసీలకు విద్యుత్ బస్సులపై సబ్సిడీని ఇచ్చే విధంగా మార్పు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దాని కోసం ప్రయత్నం చేయాలని కోరారు. 2029 నాటికి ఆర్టీసీలో అన్నీ విద్యుత్ బస్సులు వస్తాయని రవాణా మంత్రి ప్రటించారని, కావున వీటిని ఆర్టీసీ ద్వారానే తీసుకునే విధంగా రాష్ట్రప్రభుత్వం కషి చేయాలన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సులో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న జవహర్

ఆర్థికాభివృద్ధిలో బ్యాంకు ఉద్యోగుల పాత్ర శ్లాఘనీయం

యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి జవహర్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బ్రాడీపేట పెన్షనర్స్ హోమ్ సమావేశ మందిరంలో ఆదివారం 'ది గుంటూరు డిస్ట్రిక్ట్ బ్యాంక్ రిటైరీస్ కోఆర్డినేషన్ కమిటీ' సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రీజినల్ హెడ్ ఎన్. జవహర్ మాట్లాడుతూ ఏడున్నర దశాబ్దాల దేశ ఆర్థికాభివృద్ధిలో రిజర్వ్ బ్యాంకు మార్గదర్శక త్వంలో పనిచేస్తున్న బ్యాంకుల విశ్రాంత అధికారులు, ఉద్యోగుల పాత్ర గణనీయమై నదన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఐకమత్యం ద్వారా పరిష్కరించుకోవాలని జవహర్ సూచించారు. ఆలిండియా బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్ కార్యనిర్వ హక కార్యదర్శి వారణాసి కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.ఎల్లారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అన్ని బ్యాంకుల అధికారులు, ఉద్యోగ సంఘాల పోరాటాల ద్వారా ఫ్యామిలీపెన్షన్ లక్ష 97 వేల మందికి సాధించుకోగలిగామన్నారు. బ్యాంకు యాజమాన్యాలు జాతీయస్థాయిలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర జోనల్, రీజినల్ స్థాయి అధికారులు అమలు చేయడంలో కాలయాపన చేయటం బాధాకరమన్నారు. దీనిపై తగిన రీతిలో కార్యాచరణ ప్రణాళిక ద్వారా త్వరలో సాధించుకుంటామని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్త సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో అన్ని రకాల వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధిలో బ్యాంకులు అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం మరువలేనిదన్నారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు కె.హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల విశ్రాంత అధికారులు, ఉద్యోగులు బ్యాంకుల పురోభివద్ధితోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్రం, జాతీయ స్థాయిలో బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త సామినేని కోటేశ్వరరావును కోఆర్డినేషన్ కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంకు రిటైరస్ కోఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.వి.బి మురళీకష్ణారావు, తెలంగాణ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.వి.రమణ, ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.కోటేశ్వరరావు, ఆలిండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ నాయకులు వై.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో 7 ఓపీ కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన ఓపి కేంద్రాల్ని శాసనసభ్యులు షేక్ మహమ్మద్ నజీర్ ఆదివారం ప్రారంభించారు. 2800 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ. 15 లక్షల వ్యయంతో ఏడు ఓపి కౌంటర్లను ప్రారంభించారు. నిత్యం రద్దీగా ఉండే పొరుగు సేవలు విభాగంలో ఈ ఏడు కౌంటర్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించవచ్చు అని నసీర్ అన్నారు.

సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ ఆసుపత్రి ప్రక్షాళన చేస్తున్నారని తెలిపారు. జిజిహెచ్‌లో కార్పొ రేట్ వైద్య సేవలను అందించడానికి కృషి చేస్తున్నామని తెలి పారు. ఆసుపత్రికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, అభివృద్ధి సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఆరవ డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, హెచ్ డి ఎస్ సభ్యులైన డాక్టర్ రసూల్ , డాక్టర్ ఎస్ ఉమా శంకర్, డాక్టర్ హరిత అడ్మినిస్ట్రేటర్ సుధారాణి, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒపి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్యసేవలు

హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ 36వ వార్షికోత్సవ సందర్భంగా ఏ.పి గెట్ హెల్దీ అనే నినాదంతో గుంటూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరులో 925 పడకలతో తమ ఆసుపత్రిలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్.పోతినేని రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం గుంటూరు రమేష్ హాస్పిటల్స్‌లో డాక్టర్ రమేష్‌బాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే కాలంలో చేపట్టబోయే ప్రణాళికల గురించి వివరించారు. భారతదేశంలోనే ఆరోగ్య సంరక్షణలో 3వ అతి పెద్ద దిగ్గజ సంస్థలైన ఆస్టర్ డి.ఎం. హెల్త్ కేర్, కేర్ హాస్పిటల్స్ భాగస్వామ్యంతో నిష్ణాతులైన వైద్య నిపుణుల బందంతో అత్యాధునికమైన వైద్య చికిత్సలను ఆంధ్రప్రదేశ్‌లో అందిస్తున్నా మని, 'టావి, మైట్రాక్లిప్' వంటి గుండెశస్త్ర చికిత్సకు ప్రత్యామ్నాయంగా ఇంటర్వెన్షన్ విధానంలో చికిత్సలను ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరులో మొట్టమొదటి సారిగా చేశామని తెలియచేసారు.ఇప్పటికే 30 వరకు కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చికిత్సలను నిర్వహించామని, క్లిష్టతరమైన గుండె, ఊపిరితిత్తుల మార్పిడి చికిత్సలతో పాటు అత్యాధునిక క్యాన్సర్ సెంటర్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అదేవిధంగా రాజధానిలో అంతర్జాతీయస్థాయి క్వాటరినరీ కేర్ హాస్పిట ల్‌ను తీసుకువస్తామని తెలియచేశారు.ప్రభుత్వ భాగస్వామ్యంతో 'క్లౌడ్ డాక్స్ రమేష్' టెలీ ఐ.సీ.యు ద్వారా మారు మూల గిరిజన ప్రాంతాలైన రంపచోడవరం, పాడేరు ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్యసేవలు త్వరలో ప్రారంభించ బోతున్నట్లు తెలిపారు. రమేష్ గ్రూపులో ఉన్న అన్ని హాస్పిటల్స్ ఐసీయూలో ఉన్న క్రిటికల్ కేర్ పేషెంట్లను విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా 24 గంటలూ నిపు ణుల పరిశీలనలో ఉంచే సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. వైద్యరంగంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ పెంచడంలో భాగంగా అత్యాధు నిక డ్రోన్‌సేవలు ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. అలాగే, ఎ.ఐ ఆధారిత సి.టి, యాంజి యోగ్రామ్, ఇసిజి, ఎకో, ఎంఆర్ఐ వంటి టెక్నాలజీలతో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సమయానికి వైద్యం అందించడం సాధ్యమవుతుందన్నారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో రోగుల ఆరోగ్య ప్రమాణాలు గణనీ యంగా మెరుగుపడతాయనే విశ్వాసాన్ని డాక్టర్. రమేష్‌బాబు వ్యక్తం చేశారు.ఆరోగ్యశ్రీ, ఆరోగ్య భాగ్యం, ప్రతి మంగళవారం ఉచిత వైద్యసేవలు ఎన్.టి.ఆర్ వైద్య సర్వీసుల ద్వారా 20 వేలమందికి పైగా గుండె వైద్య చికిత్సలు నిర్వహించా మన్నారు. ఆదివారం జరిగిన ఉచిత వైద్యశిబిరాలలో వివిధ రంగాల్లో నిపుణులైన 75 మంది వైద్యులు పాల్గొన్నారని, ఈఉచిత వైద్య శిబిరంలో 1700 మంది గుంటూరు, పరిసర ప్రాంత ప్రజలు వైద్య సేవలు పొందారని వెల్లడించారు. కార్యక్ర మంలో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. మమత రాయపాటి, గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

అస్తవ్యస్త జీవనశైలితో మూత్రపిండాల సమస్య

సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సునీల్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

మధుమేహం, అధిక రక్తపోటు, అస్తవ్యస్త ఆహార జీవనశైలి మూత్రపిండాలు దెబ్బతినటానికి కారణాలని, సైలెంట్ కిల్లర్‌గా పిలిచే ఈ మూత్రపిండాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కిలారి సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో కిడ్నీ వ్యాధులపై రచయిత బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి అధ్యక్షతన ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సభలో సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కిలారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ చాపకింద నీరులా, నిశ్శబ్దంగా, రహస్యంగా జబ్బుపడే తత్వం మూత్రపిండాలకు ఉందన్నారు. కావున ముందస్తు పరీక్షలతో వాటి పని తీరునుపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. మూత్రపిండాల వ్యాధులు ప్రారంభ దశలో బయటపడవని, మూడోదశ నుండి కొన్ని లక్షణాలు బయటపడతాయని అన్నారు. మూత్రంలో నురగ, అధిక రక్తపోటు, వాపుమీద వేలితో ఒత్తిచూస్తే గుంట పడటం, కాళ్లు, కళ్ల దిగువన వాపు కనిపించటం లాంటి లక్షణాలు కనిపిస్తే మూత్రపిండాల వ్యాధి బాగా పెరిగినట్లు లెక్కన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, మూత్రపిండాల్లో రాళ్లు, మూత్రనాళం ఇన్ఫెక్షన్లు, నొప్పి నివారణ మందులు, ఊబకాయం, కుటుంబచరిత్రలో తీవ్రమూత్రపిండాల వ్యాధులు ఉన్న వాళ్లకు మూత్రపిండాలు పాడయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కిడ్నీ ఫెయిల్యూర్ అయినట్లు తెలిసినా వారికి ఆ దశలో డయాలసిస్, మూత్ర

మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

పిండాల మార్పిడి అవసరం అవుతుందన్నారు. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే కిడ్నీ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉన్న వారు ఏడాదికోసారి ఎస్టిమేటెడ్ జీఎఫ్ఆర్ టెస్ట్, మూత్రంలో ప్రొటీన్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. జీవితాంతం డయాలసిస్‌పై ఆధారపడటం కంటే మూత్రపిండాల మార్పిడితో శాశ్వత పరిష్కారాన్ని ఎంచుకోవటం ఉత్తమమం అన్నారు. ఉప్పు తగ్గించటం, మూత్రంలో ప్రొటీన్ నష్టాన్ని తొలి దశలోనే గుర్తించి మందులు వాడుకోవటం, మధుమేహం, అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవటం వంటి ముందస్తు చర్యల ద్వారా కిడ్నీ వ్యాదులు దరిచేరకుండా చూసుకోవచ్చన్నారు. సభలో టి.వి. సాయిరాం, యం.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.